రామారావు కేసులో

# నివేదిక తెప్పించుకుంటా

**తెదేపా బృందానికి బూటాసింగ్ హామీ**

**న్యూఢిల్లీ, న్యూస్‌టుడే:** కొవ్వూరు ఎమ్మెల్యే రామారావుపై రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు కేసు నమోదు చేసి వేధిస్తోందని తెలుగుదేశం చేసిన ఫిర్యాదుపై జాతీయ ఎస్సీ కమిషన్ ఛైర్మన్ బూటాసింగ్ సానుకూలంగా స్పందించారు. అధికారుల నుంచి నివేదిక తెప్పించుకుంటానని తెలిపారు. దానిని పరిశీలించిన అనంతరం రాజ్యాంగ, న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రామారావుపై తప్పుడు అభియోగాలు నమోదు చేసి మానసికంగా వేధిస్తున్నారంటూ తెదేపా ఎంపీలు, ఎమ్మెల్యేల బృందం గురువారం బూటాసింగ్‌ను కలిసి ఫిర్యాదు చేసింది. పార్లమెంటరీ పార్టీ నేత నామానాగేశ్వరరావు నేతృత్వంలో ఎంపీలు మైసూరారెడ్డి, హరికృష్ణ, రమేష్‌రాథోడ్, నిమ్మలకిష్టప్ప, ఎం.వేణుగోపాల్ రెడ్డి, ఎన్.శివప్రసాద్, కొనకళ్ల నారాయణ, పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వర్లరామారావు.. ఎమ్మెల్యేలు బల్లి దుర్గాప్రసాద్, కె.ఎస్.రత్నం, హనుమంతు షిండే.. మాజీ ఎంపీ ఎర్రన్నాయుడు, ఎమ్మెల్సీ వై.బాబూరాజేంద్రప్రసాద్‌లు బూటాను కలిసి వినతిపత్రం సమర్పించారు. రామారావుని చూసి ఓర్వలేని కాంగ్రెస్ నాయకుడు పిల్లి డేవిడ్‌కుమార్, సాక్షి టీవీ విలేకరి శ్యామలరావు కలిసి కుట్రపన్నారని వివరించారు. ఇందులో ముఖ్యమంత్రి వైఎస్ కుటుంబసభ్యులు నడుపుతున్న 'సాక్షి' పత్రిక ప్రధాన భూమిక పోషించిందని ఆరోపించారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, ఎస్పీలు దర్యాప్తు జరిపి ఎమ్మెల్యేకు చెందిన నర్సింగ్ కళాశాల ప్రాంగణంలో ఎలాంటి నేరం జరగలేదని తేల్చారని ఆయన దృష్టికి తెచ్చారు. అక్కడున్నవి రెడ్ ఆక్సైడ్ గుర్తులే తప్ప రక్తపు మరకలు కావని ఫోరెన్సిక్ నిపుణులు సైతం తేల్చారని వివరించారు. అయితే అధికారుల బహిరంగ ప్రకటనలను కూడా పట్టించుకోకుండా ప్రభుత్వం కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తోందని చెప్పారు. కేసును మూసేయకుండా సుమోటోగా దీని దర్యాప్తు బాధ్యతలను సీఐడీకి అప్పగించిందని వివరించారు. ఎమ్మెల్యే పరువుకు నష్టం కలిగించే విధంగా 'సాక్షి' పత్రిక దురుద్దేశపూరితంగా తప్పుడు కథనాలు ప్రచురిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ కక్షసాధింపు ధోరణిని వ్యతిరేకిస్తూ తెదేపా ప్రజా ప్రతినిధులంతా ముఖ్యమంత్రిని కలిసిన విషయాన్ని కూడా బూటా దృష్టికి తీసుకెళ్లారు. ఈ కేసులో ఎస్సీ కమిషన్ జోక్యం చేసుకొని ప్రభుత్వ నియంతృత్వ ధోరణి నుంచి ఎమ్మెల్యేను రక్షించాలని కోరారు.

తెదేపా సభ్యుల విజ్ఞప్తిని సావధానంగా విన్న బూటాసింగ్ తర్వాత విలేఖర్లతో మాట్లాడారు. దీనికి సంబంధించిన నిజానిజాలను రాష్ట్ర ప్రభుత్వంతో పాటు, వివిధ అధికార యంత్రాంగాల నుంచి తెప్పించుకొని పరిశీలిస్తామని చెప్పారు. నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇది తప్పుడు కేసనే విషయం బూటాసింగ్ నోటినుంచే వచ్చిందని, అందువల్ల న్యాయం జరుగుతుందన్న నమ్మకం తమకుందని వ్యాఖ్యానించారు.



ఎస్సీ, ఎస్టీ జాతీయ కమిషన్ ఛైర్మన్ బూటాసింగ్‌కు గురువారం ఢిల్లీలోని ఆయన నివాసంలో వినతిపత్రం సమర్పిస్తున్న తెదేపా పార్లమెంటరీ నేత నామా నాగేశ్వరరావు. చిత్రంలో మాజీ ఎంపీ ఎర్రన్నాయుడు